క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: నర్సిపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం పెద్దలవునిపల్లి గ్రామానికి చెందిన జడ్యాడ రాము తీవ్రంగా గాయపడ్డాడు. టెక్కలి పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలిలోని ఓ బైక్ షోరూంలో పనిచేస్తున్న రాము పనులు ముగించుకుని తిరిగి తన ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళ్తుండగా.. నర్సిపురం గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో అతని తలకి తీవ్రగాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి.. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిఫర్ చేయగా.. అక్కడ నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు.

సంక్షేమ పథకాలు పొందాలి


మత్స్యకారులతో సమావేశమైన అధికారులు

టెక్కలి: స్వదేశీ మత్స్యకారులంతా ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి సంక్షేమ పథకాలు పొందాలని మత్స్యశాఖ జిల్లా అధికారి పి.వి.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక కంద్రవీధిలో చంద్రశేఖర స్వదేశీ మత్స్యకార సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడిన తరువాత కలిగే ప్రయోజనాలను వివరించారు. సమావేశంలో పరిశీలకుడు చిట్టినాయుడు, ఎఫ్‌డీవో ధర్మరాజు పాత్రో, సహాయకుడు బి.మధుసూదనరావు ఉన్నారు.

కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలి


వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పలాస: తమపై పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది చేయాల్సిన పనులు, సర్వేలు తమకు అప్పగించడం సరికాదన్నారు. ఈ మేరకు పలాస మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం పరిపాలన అధికారిణి అనూరాధకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు లండ శ్రీధర్ పాల్గొన్నారు.

1400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


సోంపేట: బెల్లం ఊటను నిల్వ చేసిన ప్లాస్టిక్ డ్రమ్ముల వద్ద ఎక్సైజ్ సిబ్బంది

సోంపేట: మందస మండలం చాపరాయి కోటలో సారా తయారీకి సిద్ధం చేసిన 1400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.బేబి సోమవారం తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలుగ్రామాల్లో సోంపేట, పలాస సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించినట్టు చెప్పారు.

140 సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు

కంచిలి: మండల కేంద్రంలోని బలియాపుట్టుగ కాలనీలో 140 నాటుసారా ప్యాకెట్లతో సాహుకారి మహేశ్ అనే వ్యక్తి పోలీసులకు సోమవారం సాయంత్రం పట్టుబడ్డాడు. మహేశ్ ప్లాస్టిక్ సిమెంటు కవర్లో సారా ప్యాకెట్లను తీసుకొస్తుండగా పట్టుకున్నట్టు పోలీసులు చెప్పారు. మహేశ్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు


పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ తుంగాన సుశీల ప్రజల కోరిక మేరకు 24 గంటల్లో పైపులైన్ మరమ్మతులు చేపట్టారు. పాత వాటర్ ట్యాంక్ నుంచి ఎస్సీ, బీసీ కాలనీకి వెళ్లే పైపులైన్ పాడవ్వడంతో సుమారు 60 కుటుంబాలు నీటి కోసం అవస్థలు పడ్డారు. సమస్యను కాలనీ వాసులు సర్పంచ్ సుశీల దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె జలజీవన్ మిషన్ అధికారులకు తెలియజేశారు. సిబ్బంది వచ్చి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు.



భూమి పూజ

సోంపేట మండలం పలాసపురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ తడక జోగారావు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు యశోద సోమవారం భూమి పూజ చేశారు. పంచాయతీ తీర్మానంతో ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్డును నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు పొలాకి రమణమూర్తి, వార్డు సభ్యులు దుద్ది కోదండరావు, బల్ల సోనీ ఉన్నారు.

–సోంపేట



స్త్రీలను గౌరవించాలి

సమాజంలో స్త్రీలను గౌరవించాలని సోంపేట తహసీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోంపేట పట్టణంలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, ఏపీవో ప్రమీల, ఏపీఎం రమణమ్మ పాల్గొన్నారు.

–సోంపేట



మౌలిక వసతులు కల్పించాలని..

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తికి సోమవారం వినతి పత్రం అందజేశారు. పలాసలోని వివిధ వసతి గృహాల్లో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. కనీసం మంచినీటి సదుపాయం కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

–పలాస



ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. పాయితారి, కీర్తిపురం గ్రామాల్లోని ప్రజలకు ఆన్‌లైన్ మోసాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమ వారం అవగాహన కల్పించారు. బంగారు నగలతో మహిళలు ప్రయాణించే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, అనుమానం వస్తే అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

గ్రామ స్వరాజ్యానికి తూట్లు!

- పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిన కూటమి సర్కార్
- సర్పంచ్‌లకు సంబంధం లేకుండా పనుల కేటాయింపు
- వెండర్ ద్వారా నగదు చెల్లింపులు


ఆకాశలక్కవరంలో సర్పంచ్ లేకుండా రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న కూటమి నాయకులు (ఫైల్)

సంతబొమ్మాళి:

గ్రామ స్వరాజ్యం తెస్తామని గొప్పలు చెప్పుకున్న కూటమి ప్రభుత్వం ఆచరణలో చతికల పడుతుంది. ఇప్పటికే సచివాలయాలను నిర్వీర్యం చేయగా.. అభివృద్ధి పనుల విషయంలో కూడా సర్పంచులు, కార్యదర్శులకు సంబంధం లేకుండా వెండర్ల ద్వారా నగదు చెల్లింపులు చేస్తూ కొత్త దందాకు తెర లేపింది. ప్రస్తుతం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు ప్రభుత్వానికి ఆదాయ వనరులుగా మారాయి. కూటమి సర్కార్ వచ్చి రాగానే అభివృద్ధి పేరుతో పనులకు శంకుస్థాపన చేసుకుంటూ వెలుతుంది. అయితే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తామని, కేంద్రం నుంచి వస్తున్న నిధులను సక్రమంగా వినియోగిస్తామని గొప్పగా చెప్పుకొచ్చారు. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఈ ఏడాది ఆగస్టు నెల నుంచి గ్రామ సభలను ఏర్పాటు చేసి పనులు గుర్తిస్తూ పంచాయతీలు తీర్మానం చేశాయి. కాని ఇక్కడే అసలు గుట్టుదాగి ఉంది. పంచాయతీలకు, సర్పంచ్‌లకు ఎటువంటి సంబంధం లేకుండా అధికార పార్టీ నాయకులకు పనులు కేటాయించి భూమి పూజలు చేయించారు. గతంలో ఇలాంటి పనులకు చెల్లించవలసిన బిల్లు లు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శి జాయింట్ అకౌంట్‌లో వేసి బిల్లులు చెల్లించేవారు. కానీ ప్రస్తుతం వెండర్ అకౌంట్ ద్వారా పనులను చేస్తున్నారు. సంతబొమ్మాళి మండలానికి సంబంధించి రూ.15 కోట్లతో 170 రకాల పనులు గుర్తించారు. ఈ పనులు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రావెల్ రోడ్లకు మంజూరయ్యాయి. అలాగే రూ. 6 కోట్ల 50 లక్షలతో 16 టూరిజం వర్క్‌లు మంజూరయ్యాయి. అధికార పార్టీ నాయకుల జేబులు నింపడానికి వెండర్ ద్వారా చెల్లింపులను చేస్తున్నారని పలువురు సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. దీనిపై ఇటీవల మండలంలో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులను గట్టిగానిలదీశారు.

పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్నారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సర్పంచ్‌లతో సంబంధం లేకుండా పనులు చేస్తున్నా రు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ అకౌంట్‌తో పనులకు బిల్లులు చెల్లించేవారు. ఇప్పుడు నేరుగా వెండర్ల ద్వారా అధికార పార్టీ నాయకులతో పనులు చేయించడం భావ్యం కాదు. పంచాయతీలను నిర్వీర్యం చేయడం తగదు. సర్పంచ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– పరపటి సునీతరెడ్డి, సర్పంచ్, మేఘవరం, సంతబొమ్మాళి మండలం

సర్పంచ్‌లకు సంబంధం లేదు

ప్రస్తుతం చేపట్టే పనులన్నీ ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్రం ఇచ్చిన నిధులతో చేయిస్తున్నాము. ఈ విషయంలో సర్పంచ్‌లకు ఎలాంటి సంబంధం లేదు. వెండర్ ద్వారా పనులు చేపడుతున్నాం. వారి ఖాతాలోనే నిధులు జమ చేస్తాం.

– అజింత్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ, సంతబొమ్మాళి మండలం

ఇలా చేయడం తగదు



గ్రామాల్లో పనులు గుర్తించడం కోసం అధికారులు ఆగస్టు నెలలో గ్రామ సభలు నిర్వహించి సంతకాలు తీసుకున్నారు. కానీ పంచాయతీకి, సర్పంచ్‌లకు ఎటువంటి సంబంధం లేదని చెప్పడం సరైనదికాదు. వెండర్ల ద్వారా బిల్లులు చెల్లిస్తే పంచాయతీలకు తీరని నష్టం జరుగుతుంది. ఇది చాలా అన్యాయం.

– బి. మోహన్‌రెడ్డి, సర్పంచ్, భావనపాడు, సంతబొమ్మాళి మండలం

టెక్కలి డివిజన్‌లో 6,668 ఎల్ఆర్‌బీడీ దరఖాస్తులు

టెక్కలి: విద్యార్థులకు అపార్ నమోదు ప్రక్రియలో భాగంగా జనన ధ్రువీకరణ పత్రాల్లో చేర్పులు, మార్పులు, లాంగ్ రిజిస్ట్రేషన్ బర్త్ సర్టిఫికెట్ల కోసం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయానికి అత్యధిక సంఖ్యలో (ఎల్ఆర్‌బీడీ) దరఖాస్తులు చేరుతున్నాయి. ఈ నెల 11వ తేదీ నుంచి ఆరంభమైన ప్రక్రియలో భాగంగా టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట తదితర మండలాల నుంచి ఇప్పటివరకు సుమారు 6,668 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు కార్యాలయంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. డివిజన్‌కు సంబంధించి సుమారు 20 వేల వరకు దరఖాస్తులు రావచ్చనే అంచనా వేస్తున్నారు. ఎల్ఆర్‌బీడీ నమోదు విషయంలో దళారీలను నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు.

జగతి-శిలగాం రోడ్డు అభివృద్ధి చేయాలి

- జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్సీ రామారావు వినతి


జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: జగతి హనుమాన్ జంక్షన్ నుంచి శిలగాం వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిని కలిపే జే-ఎస్ రోడ్డును డబుల్‌లైన్‌రోడ్డుగా విస్తరణకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను సోమవారం తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్డుకు ఇరువైపులా దట్టంగా ముళ్లపొదలు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాల రాకను గుర్తించడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించి జంగిల్‌క్లియరెన్స్‌కు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రైల్వే సమస్యలు పరిష్కరించాలని వినతి


డీసీఎం సునీల్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

కంచిలి: సోంపేట రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, సౌకర్యాలు కల్పించాలని కోరుతూ స్థానిక జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాసరావు రౌతో నేతృత్వంలో స్టేషన్ కన్సల్టింగ్ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు ఖుర్దా రైల్వే డివిజన్ అధికారులను సోమవారం కలిసి విన్నవించారు. సోంపేట స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్‌లో రద్దు చేసిన రెండో షిఫ్టును పునరుద్ధరించాలని, కోచ్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, రోజూ ఉదయం 4.23 గంటలకు వస్తున్న ట్రైన్ నంబర్ 08531 బరంపురం-విశాఖపట్నం ట్రైన్ ఒకటో నంబర్ ప్లాట్ ఫాంలో నిలిపేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా వీరు ఖుర్దాలో ఏడీఆర్ఎం, సీనియర్ డీవోఎం, సీనియర్ డీసీఎంలను కలిశారు. అధికారులను కలిసిన వారిలో రిటైర్డు టీటీఈ లోళ్ల సూర్యనారాయణ, స్టేషన్ కన్సల్టింగ్ కమిటీ సభ్యులు సంజయ్‌శర్మ, నాగేంద్ర పట్నాయక్, సాహుకారి తిరుపతిరావు, పూనా రవికుమార్ ఉన్నారు.

లింగ వివక్షను వ్యతిరేకించాలి


ఇచ్ఛాపురం రూరల్: తులసిగాంలో ర్యాలీ చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు


వజ్రపుకొత్తూరు రూరల్: ర్యాలీ చేస్తున్న దృశ్యం


కంచిలిలో మహిళల మానవహారం

కంచిలి: లింగ వివక్షను వ్యతిరేకించాలని మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు కోరారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఉత్తర్వుల మేరకు ఈ నెల 25 నుంచి డిసెంబర్ 22 వరకు లింగ వివక్షకు వ్యతిరేకంగా వివిధ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా కంచిలిలో ర్యాలీ, మానవహారం చేసి మహిళా సంఘాల సభ్యులు, ఉద్యోగులు నినాదాలు చేశారు. మహిళా సమాఖ్య సభ్యులు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.


కవిటి: కవిటి కొత్తూరులో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: లింగ వివక్షతను నిర్మూలించడం మనందరి బాధ్యతని వెలుగు సీఓ పొందల విష్ణు అన్నారు. డీఆర్‌డీఏ,వెలుగు ఆధ్వర్యంలో తులసిగాం పంచాయతీలో లింగ వివక్షకు వ్యతిరేకముగా స్వయం సహాయక సంఘాలతో ర్యాలీ, మానవ హారం నిర్వహించారు.

వజ్రపుకొత్తూరు: జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు మహిళల చేత జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. సీసీలు రేణుక హరిప్రియ, వెంకటరావు, వీవోఏలు, వీవో అధ్యక్షులు పాల్గొన్నారు.

మహిళలపై అకృత్యాలపై సమరభేరి

కవిటి: కవిటికొత్తూరులో గ్రామైక్య సంఘాల సిబ్బందితో కలిసి చైతన్య ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఏపీఎం కె.గోవింద, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి

పలాస: జర్నలిస్టులపై కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని పలాస ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జర్నలిస్టులు సోమవారం సమావేశమయ్యారు. కేసులను ఉపసంహరించుకోవాలని కోరుతూ చేసిన తీర్మానం కాపీని జిల్లా ఎస్పీకి పంపించాలని నిర్ణయించారు. త్వరలో ఎస్పీని కలిసి కేసుల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఏపీఎస్టీ అధ్యక్షుడుగా మల్లేశు


మల్లేశు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా బాలకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఆంగ్ల భాషోపాధ్యాయుడు సప్పటి మల్లేశు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు ఏపీఎస్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు తెలిపారు. మల్లేశుకు మండల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

మున్సిపల్ గ్రీవెన్స్‌కు 16 వినతులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 16 వినతులు వచ్చాయి. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు వినతులను స్వీకరించారు. వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రామారావు

రెడ్డిక కుల సంఘ నూతన కార్యవర్గం


సమావేశమైన కార్యవర్గ సభ్యులు

ఇచ్ఛాపురం:

ఇచ్ఛాపురం పట్టణ రెడ్డిక కుల సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో 23 సభ్యులతో కూడిన నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దుర్గాసి పాపారావు, ఉపాధ్యక్షునిగా పరపటి కోటి, కార్యదర్శిగా బర్ల లక్ష్మణరావు, కోశాధికారిగా ఉప్పాడ చిన్నబాబు, సంయుక్త కార్యదర్శిగా దక్కత బాషా ఉన్నారు.

మార్మోగిన పంచాక్షరి

కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు నదులు, చెరువులు, సముద్రంలో పవిత్రస్నానాలు ఆచరించి శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. క్షీరాభిషేకాలు, దూపదీప నైవేద్యాలను స్వామికి సమర్పించారు. కార్తీక దీపాలను నీటిలో విడిచిపెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయశాఖ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.


కవిటిలో పూజలందుకున్న చంద్రశేఖరస్వామి


టెక్కలి: రావివలస మల్లన్న సన్నిధిలో భక్తజనం


సంతబొమ్మాళిలోని శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు


కంచిలి:బూరగాం శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు


కంచిలి: మకరాంపురం శివాలయంలో పూజలు

స్వదేశీ మత్స్యకారులకు తంపర భూములు కేటాయించాలి


స్వదేశీ మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరావు

ఇచ్ఛాపురం రూరల్: తరతరాలుగా బూర్జపాడు పంచాయతీ డొంకూరులోని తంపర భూముల్లో చేపల పట్టుకొని జీవనం సాగిస్తున్నామని ఈదుపురం స్వదేశీ మత్స్యకారులు అన్నారు. తంపర భూముల్ని తమకు కేటాయించాలని కోరుతూ ఇటీవల ఈదుపురం స్వదేశీ మత్స్యకారులు ముఖ్యమంత్రి పేషీకి ఫిర్యాదు నేపథ్యంలో సోమవారం తహసీల్దార్ ఎస్.వెంకటరావు తన సిబ్బందితో తంపర భూముల్ని పరిశీలించారు. డొంకూరు, బూర్జపాడు, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన స్థానికులు తంపరలో చేపల వేటను సాగిస్తున్నందున తాము ఉపాధిని కోల్పోతున్నామన్నారు. వెంటనే సర్వే చేసి తమ భూముల్ని తమకు అప్పగించాలని ఈదుపురానికి చెందిన ఫిషరీస్ సొసైటీ సభ్యులు కోరారు.